
సాక్షి ఖమ్మం

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



అభివృద్ధి సరే.. ఆగే రైళ్లు ఏవీ?

మధిర రైల్వేస్టేషన్ రూ.కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తున్నా అవసరమైన రైళ్లకు హాల్టింగ్ ఇవ్వకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. 8లో



ఎల్ఆర్ఎస్ చకచకా

భూక్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకుని ఫీజు చెల్లించిన వారికి ప్రొసీడింగ్ జారీలో అధికారులు వేగం పెంచారు. 8లో



వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. సాయంత్రం తర్వాత కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఖమ్మంలో పర్యటించనున్నారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధి 46వ డివిజన్ జూబ్లిపురలో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే, సారథినగర్ వద్ద రామాలయం సమీపాన అభివృద్ధి పనులను మంత్రిప్రారంభించనున్నారు.

పెద్దాస్పత్రిలో లీగల్ ఎయిడ్ క్లినిక్



సెంటర్ వద్ద చంద్రశేఖర్‌రావు, అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో లీగల్ ఎయిడ్ క్లినిక్(డీ అడిక్షన్, రీహాబిలిటేషన్ సెంటర్)ను ఏర్పాటుచేశారు. ఈ సెంటర్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు సోమవారం ప్రారంభించి మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారిని జిల్లా నుండి పారదోలేలా అందరూ సహకరించాలని సూచించారు. అలాగే, పిల్లలు, యువత పక్కదారి పట్టకుండా మార్చడాన్ని బాధ్యతగా భావించాలని తెలిపారు. ఎవరైనా డ్రగ్స్‌కు బానిసైన వారిని సెంటర్‌కు తీసుకొస్తే చికిత్స చేయడమే కాక కౌన్సెలింగ్ ఇస్తారని చెప్పారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రతీ శనివారం ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు పనిచేస్తుందని తెలిపారు. ఆస్పత్రి మెడికల్ పరింటెండెంట్ ఎం.నరేందర్, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ సౌమ్య, వైద్యులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో 100 సీట్లు భర్తీ



విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2025–26 ఏడాదికి గాను పూర్తి స్థాయిలో సీట్లు భర్తీ అయ్యాయి. జాతీయ కోటాలో 15 సీట్లు తొలి విడత కౌన్సెలింగ్‌లోనే భర్తీ కాగా, రాష్ట్ర స్థాయి కోటా కింద కేటాయించిన 85 సీట్లలో సోమవారం నాటికి విద్యార్థులు చేరారు. వంద సీట్లలో సగం మంది జిల్లాకు చెందిన వారే ఉండడం విశేషం. త్వరలోనే మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించనుండగా జాతీయ కోటా విద్యార్థుల్లో ఒకరిద్దరు వెళ్లినా, ఆ స్థానాలు భర్తీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. కాగా, బుధవారం నుండి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి.

బీజేపీ జిల్లా నూతన కార్యవర్గం

ఖమ్మం మామిళ్లగూడెం: భారతీయ జనతా పార్టీ(బీజేపీ) జిల్లా నూతన కార్యవర్గాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు సోమవారం ప్రకటించారు. ఈమేరకు జిల్లా ఉపాధ్యక్షులుగా వీరవెల్లి రాజేష్, సుదర్శన్ మిశ్రా, బానోత్ రవిరాథోడ్, నకిరకంటి వీరభద్రం, బట్టు వీరంరాజు, బండారు నరేష్ నియమితులయ్యారు. అలాగే, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా గుత్తా వెంకటేశ్వర్లు, నల్లగట్టు ప్రవీణ్‌కుమార్, నాయుడు రాఘవరావు, జిల్లా కార్యదర్శులుగా పమ్మి అనిత, కుంచం కృష్ణారావు, తమ్మెర రజినీరెడ్డి, రామసెట్టి నాగేశ్వరరావు, తొండేపు సైదేశ్వరరావు, పల నాగసురేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఇంకా కోశాధికారిగా కొణతం లక్ష్మీనారాయణ, మీడియా కన్వీనర్‌గా నెల్లూరి బెనర్జీ, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా కందుల శ్రీకృష్ణ, ఐటీ ఇన్‌చార్జ్‌గా బోయినపల్లి సురేష్, కార్యాలయ కార్యదర్శిగా నక్కల రవిగౌడ్‌ను నియమించినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కృషిచేస్తూనే ప్రజాసమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పోరాడాలని కోటేశ్వరరావు నూతన కార్యవర్గానికి సూచించారు.

సీజేఐపై దాడి గర్హనీయం

ఖమ్మంలీగల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడి గర్హనీయమని ఆలిండియా లాయర్ యూనియన్ బాధ్యులు పేర్కొన్నారు. దీన్ని స్వతంత్ర న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నట్లు వారు ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఆలిండియా లాయర్స్ యూనియన్ కమిటీల ఆధ్వర్యాన మంగళవారం కోర్టు ప్రాంగణాల్లో నిరసన తెలపనున్నట్లు వెల్లడించారు. అలాగే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని బార్ అసోసియేషన్ బాధ్యులు ఖండించగా.. రాజ్యాంగ విలువలపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు మంగళవారం జిల్లా కోర్టులో నిరసన తెలపాలని అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

ముగ్గురితోనే ముడి !

అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు

- జెడ్పీటీసీ స్థానాలకు ముగ్గురేసి అభ్యర్థులతో జాబితా
- మిగతా పార్టీల్లోనూ అభ్యర్థుల ఖరారుపై మల్లగుల్లాలు
- నోటిఫికేషన్ విడుదలైతేనే పోటీపై స్పష్టత
- హైకోర్టు తీర్పు అనంతరం కదనరంగంలోకి దూకేలా ప్రణాళిక



సాక్షిప్రతినిధి, ఖమ్మం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వ్యవహారంపై కోర్టు తీర్పు రావడమే కాక రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ వస్తేనే అన్ని పార్టీలు పూర్తిస్థాయిలో దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. బీసీ రిజర్వేషన్లను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌ను సోమవారం కొట్టివేయగా హైకోర్టులో బుధవారం తీర్పు వెలువడే అవకాశముంది. దీంతో అభ్యర్థుల ఎంపిక, పొత్తులు తదితర అంశాలపై పార్టీలు అంతర్గతంగా అభిప్రాయాలు సేకరిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ బలమైన అభ్యర్థులను బరిలో నిలిపేలా పరిశీలిస్తుండగా బీఆర్ఎస్, బీజేపీ, వామపక్ష పార్టీలు సైతం కసరత్తు మొదలుపెట్టాయి.

కోర్టు తీర్పుపై ఉత్కంఠ.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై జారీ చేసిన జీఓను కొట్టివేయాలని సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్‌ను కొట్టివేశారు. ఇక హైకోర్టులో బుధవారం జరగనున్న విచారణపై అంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే తాము ఇచ్చే తీర్పు మేరకే స్థానిక ఎన్నికలు జరుగుతాయని హైకోర్టు చెప్పిన నేపథ్యాన అందరిలో ఆసక్తి నెలకొంది. కోర్టు తీర్పు అనంతరం నోటిఫికేషన్ విడుదల చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. ఆ తర్వాత అభ్యర్థుల ఎంపికపై ఓ అభిప్రాయానికి రావాలనే ఉద్దేశంతో రాజకీయ పార్టీల నేతలు ఉన్నారు.

కాంగ్రెస్ ఫోకస్

రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో తమ మార్క్ చూపించేలా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక మొదలుపెట్టింది. జెడ్పీటీసీ అభ్యర్థులను తామే ఖరారు చేస్తామని పీసీసీ వెల్లడించిన నేపథ్యాన ఒక్కో స్థానానికి ముగ్గురేసి బలమైన అభ్యర్థులతో జాబితా సిద్ధం చేస్తున్నారు. ఈ జాబితా పరిశీలించాక పీసీసీ అభ్యర్థులను ఖరారు చేయనుంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు మండల స్థాయి నేతలతో సమావేశమవుతూ ఒక్కో జెడ్పీటీసీ స్థానానికి ఐదుగురి నుంచి ఆపై సంఖ్యలో అభ్యర్థుల జాబితా ప్రాథమికంగా రూపొందించినట్లు సమాచారం. కొన్ని మండలాల్లో జెడ్పీటీసీ బరిలో ఉండేందుకు పది మంది కూడా పోటీ పడుతున్నట్లు తెలిసింది. హైకోర్టు తీర్పు, నోటిఫికేషన్ వెలువడ్డాక ముగ్గురి పేర్లు ఖరారు చేసి పీసీసీకి ప్రతిపాదిస్తారు. ఇక వార్డు సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక జిల్లా స్థాయిలోనే జరగనుంది.

నోటిఫికేషన్ వెలువడ్డాకే..

స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైనా రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం లేదు. కాంగ్రెస్ మినహా మిగిలిన పార్టీలు వేచి చూసే ధోరణిలోనే ఉన్నాయి. బీసీ రిజర్వేషన్లపై కోర్టు తీర్పు ఎలా వస్తుందనే అంశంపై పార్టీల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండగా తీర్పు వెలువడ్డాకే చూద్దాంలే అనే భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ అంతర్గతంగా మాత్రం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఎక్కడెక్కడ పోటీ చేయాలనే అంశాలపై చర్చలు సాగుతున్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ నేతలు ఇప్పటికే మండలాల వారీగా సమావేశాలు నిర్వహించినా సీపీఐ, సీపీఎం వైఖరి స్పష్టం కాలేదు. కాంగ్రెస్‌తో కలిసి సీపీఐ పోటీ చేస్తుందా.. ఒంటరిగా బరిలో దిగుతుందా, సీపీఎంతో జట్టు కడుతుందా అన్నది తేలాల్సి ఉంది. బరిలో ఉంటామని ఇప్పటికే సీపీఎం ప్రకటించింది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే తప్ప పొత్తులు, పోటీపై స్పష్టత వచ్చే అవకాశం లేదని చెబుతున్నారు.

ఎంపీటీసీపై అనాసక్తి

ఆశావహుల్లో ఎక్కువ మంది జెడ్పీటీసీ, సర్పంచ్ పదవులపైనే ఆశ పెట్టుకున్నారు. ఈ విషయాన్ని నేతల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఎంపీపీ అయ్యేందుకు అవకాశం ఉందని భావిస్తున్న వారే ఎంపీటీసీగా బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. అలా సాధ్యం కాదనుకునే వారు ఎంపీటీసీగా పోటీకి అయిష్టత కనబరుస్తున్నారు. దీంతో పార్టీల్లో జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలకు పోటీ పెరుగుతుండగా.. కొందరు తామే పోటీ చేస్తామంటూ ప్రచారం చేసుకుంటుండడం ముఖ్యనేతలకు ఇబ్బందికరంగా మారింది.

స్ట్రాంగ్ రూమ్‌లు పరిశీలించిన కలెక్టర్



గ్రేస్ కళాశాలలో వసతులపై ఆరా తీస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్/కొణిజర్ల: త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సామగ్రి భద్రపర్చడంతో పాటు డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్ల ఏర్పాటుకు అనువైన భవనాలను అధికారులు గుర్తిస్తున్నారు. ఇందులో భాగంగా కొణిజర్ల మండలంలోని గ్రేస్ కళాశాల, ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల, బూరుగూడెంలోని మహ్మదీయ కళాశాలలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం పరిశీలించారు. చింతకాని, వైరా, కొణిజర్ల మండలాల బ్యాలెట్ బాక్సులను గ్రేస్ కళాశాలలో, సింగరేణి, కామేపల్లి, రఘునాథపాలెం మండలాలకు సంబంధించి ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్‌లో, తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం రూరల్ మండలాల బ్యాలెట్ బాక్సులను మహ్మదీయ కళాశాలలో భద్రపర్చేందుకు ఉన్న వసతులను పరిశీలించి చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఖమ్మం ఆర్‌డీఓ నర్సింహారావు, అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

బ్యాలెట్ పేపర్ల ముద్రణకు టెండర్లు

ఖమ్మం సహకారనగర్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ పేపర్ల ముద్రణకు ఈనెల 8వ తేదీలోగా టెండర్లు దాఖలు చేయాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. టెండర్ ఖరారైన నాలుగు రోజుల్లోగా ముద్రించాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకు అవసరమైన పేపర్లు తాము సమకూరుస్తామని చెప్పారు. ఆసక్తిఉన్న ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు రూ.5వేల డీడీ చెల్లించి టెండర్ ఫారం తీసుకున్నాక పూర్తి వివరాలు, రూ.50 వేల డీడీతో ఈనెల 8లోగా సమర్పించాలని సూచించారు.

కోటమైసమ్మ జాతర ఆదాయం రూ.29.10లక్షలు

గత ఏడాది కంటే రూ.1.92లక్షలు ఎక్కువ



నగదును లెక్కిస్తున్న సిబ్బంది

కారేపల్లి: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని కారేపల్లి మండలం ఉసిరికాయపల్లిలో నిర్వహించిన శ్రీ కోటమైసమ్మతల్లి జాతర సోమవారంతో ముగిసింది. ఈమేరకు భక్తులు సమర్పించిన కానుకలను దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఈఓ కె.వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు ఆధ్వర్యాన సోమవారం లెక్కించారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన జాతర ద్వారా మొత్తం రూ.29,10,386 ఆదాయం సమకూరగా, హుండీల ద్వారా రూ.7,41,764 కానుకలు వచ్చాయని వెల్లడించారు. గత ఏడాది జాతర ఆదాయం రూ.27,17,949కాగా ఈ ఏడాది రూ.29,10,386 రావడంతో రూ.1.92లక్షల మేర పెరిగినట్లయింది. అలాగే, గత ఏడాది హుండీల ద్వారా రూ.7,33,549 వస్తే ఈసారి రూ.8,215 పెరిగి రూ.7,41,764గా నమోదైంది. ఇక పూజా టికెట్ల ద్వారా గత ఏడాది రూ.5,51,700, ఈ ఏడాది రూ.4,95,290, షాపుల వేలం ద్వారా గత ఏడాది రూ.8,34,000, ఈ ఏడాది రూ.9,64,500 ఆదాయం వచ్చింది. లెక్కింపులో దేవాదాయ శాఖ సిబ్బంది పగడాల మోహన్‌కృష్ణ, తోటకూరి వెంకటేశ్వర్లు, పర్సా సాయిలలిత్, మూడ్ మోహన్‌చౌహాన్, బోడ బన్సీలాల్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ జీవితంలో కీలకఘట్టం



సావిత్రిని సన్మానించిన డీఆర్వో, అధికారులు

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగుల జీవితంలో రిటైర్‌మెంట్ అనేది కీలకఘట్టమని డీఆర్వో పద్మశ్రీ అన్నారు. సెప్టెంబర్‌లో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను కలెక్టరేట్‌లో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ బీసీ సంక్షేమ శాఖలో సహాయ అభివృద్ధి అధికారి ఎం.ఈదయ్య, వెటర్నరీ శాఖ ఆఫీస్ సబార్డినేట్ జి.సావిత్రి చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించారని కొనియాడారు. ముప్పై ఏళ్లకు పైగా సేవలు అందించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం సన్మాన గ్రహీతలు వారి ఉద్యోగ అనుభవాలను వివరించారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతి, వెటర్నరీ అధికారులు పాల్గొన్నారు.

టీజీవోస్ జిల్లా అధ్యక్షుడిగా 'కొంగర'



కొంగర వెంకటేశ్వర్లు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల(టీజీవోస్) అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కొంగర వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఖమ్మంలో సోమవారం జిల్లా కార్యవర్గ సమావేశం జరగగా, జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. గతంలో జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కె.సత్యనారాయణ ఉద్యోగ విరమణ చేయగా, ఆ స్థానంలో ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వర్లు నియామకాన్ని సభ్యులు ఆమోదించారు. అలాగే, జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉన్న మల్లెల రవీంద్రప్రసాద్(కారేపల్లి ఎంపీఓ)ను అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. ఇక జిల్లా కోశాధికారి కొండపల్లి శేషప్రసాద్‌ను రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకున్నందున ఆ స్థానంలో డాక్టర్ సూరంపల్లి రాంబాబు(అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కాలేజీ) నియమితులయ్యారు. ఈమేరకు నూతన అధ్యక్షుడిని టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీజీవోస్ జిల్లా మాజీ అధ్యక్షుడు కస్తాల సత్యనారాయణ, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి.విజయ్‌కుమార్, నాయకులు రమేష్, పుష్పరాజ్, ఎం.సతీష్, అరుణకుమారి, గోపాలకృష్ణ, ఎస్.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కలప స్మగ్లర్.. సూర్యాపేట వాసి

- ఖమ్మం జిల్లా నుంచి తప్పుడు వివరాలతో ఎన్ఓసీలు
- ఆపై విలువైన సంద్ర కలప అక్రమ రవాణా
- అక్రమార్కులకు చింతకాని బీట్ ఆఫీసర్ సహకారం

ఖమ్మంవ్యవసాయం: కలప రవాణాకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా, అందులోని లొసుగుల ఆధారంగా సాధారణ కలప స్థానంలో విలువైన సంద్ర కలపను రవాణా చేసిన స్మగ్లర్‌ను ఎట్టకేలకు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన ఓ స్మగ్లర్ విలువైన కలపను నకిలీ ధ్రువపత్రాలతో పొరుగు రాష్ట్రాలకు రవాణా చేస్తున్నట్లు విచారణలో తేల్చారు. నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్(ఎన్‌టీపీఎస్) విధానాన్ని ఆసరాగా చేసుకుని అనుమతి ఉన్న కలప మాటున విలువైన కలపను ఉత్తరాది రాష్ట్రాలకు తరలిస్తున్న వ్యవహారం మధ్యప్రదేశ్ రాష్ట్రంలో అటవీ అధికారుల తనిఖీల్లో బయటపడింది. ఆపై తీగ లాగితే డొంక కదిలిన చందంగా వ్యవహారమంతా బయటకు వచ్చింది. ఈమేరకు వివరాలను సోమవారం ఖమ్మం జిల్లా అటవీ శాఖాధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ వెల్లడించారు.

గతనెల 24నుంచి విచారణ

ఖమ్మం జిల్లా నుంచి సాధారణ కలపను రవాణా చేసేందుకు ఎన్‌టీపీఎస్ ద్వారా విచారణ తీసుకుని విలువైన సంద్ర కలపను ఉత్తరాది రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారు. ఈ కలపను అక్కడి పాన్ మసాలా తయారీ ఫ్యాక్టరీల్లో ఉపయోగిస్తుండగా మధ్యప్రదేశ్‌లో చేపట్టిన తనిఖీల్లో అక్రమాలు బయటపడ్డాయి. దీంతో ఆ రాష్ట్ర అధికారులు ఇచ్చిన సమాచారంతో ఖమ్మం జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ నేతృత్వాన గతనెల 24 నుంచి విచారణ చేపట్టారు. ఈమేరకు సూర్యాపేట జిల్లాకు చెందిన కలప స్మగ్లర్ చింతకాని ఇన్‌చార్జి బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ ద్వారా కలప రవాణాకు సంబంధించి ఎన్‌ఓసీ తీసుకుని విలువైన కలప అక్రమ రవాణా చేసినట్లు తేల్చారు. మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుంచి సంద్ర కలప సేకరించగా.. ఆపై చింతకాని మండలం నుంచి సర్కారీ తుమ్మ తరలిస్తున్నట్లు అనుమతి తీసుకుని మధ్యప్రదేశ్ రాష్ట్రానికి పంపించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన స్మగ్లర్ అదే జిల్లా మోతె మండలానికి చెందిన ఓ లారీ ఏజెంట్ సహకారంతో కలపను ఉత్తరాది రాష్ట్రాల్లో ఉన్న పాన్ మసాలా పరిశ్రమలకు తరలిస్తుండగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝబువా, అలీపూర్ జిల్లాల్లో గుర్తించారు. కలప డీలర్లు, ప్రైవేట్ ఏజెంట్లతో చేయి కలిపినట్లు తేలడంతో ఇప్పటికే చింతకాని బీట్ ఆఫీసర్ శ్రీకాంత్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. కాగా, కలప అక్రమ రవాణా వ్యవహారంపై 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. అయితే, ఖమ్మం జిల్లా పేరిట అనుమతి తీసుకున్నా సంద్ర కలప సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి తరలించినట్లు తేలడంతో ఆయా జిల్లాల అధికారులకు సమాచారం ఇచ్చారు. అంతేకాక ఉన్నతాధికారులకు ఖమ్మం డీఎఫ్ఓ నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా మూడు జిల్లాల అధికారులు త్వరలోనే పూర్తిస్థాయిలో విచారణ చేపట్టనున్నారు.

ప్రాధాన్యత ప్రకారం ఫిర్యాదుల పరిష్కారం

గ్రీవెన్స్ డేలో కలెక్టర్ అనుదీప్



గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్: ప్రజావాణిలో ప్రజలు అందించే ఫిర్యాదులను ప్రాధాన్యత ప్రకారం పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఆయన దరఖాస్తులు, వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమైన కలెక్టర్ ఏ దరఖాస్తూ పెండింగ్ లేకుండా చూడాలని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఎవ్రీ చైల్డ్ రీడ్స్'

ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల్లో చదివే నైపుణ్యాలు పెంచేలా ఉపాధ్యాయులు పాటుపడాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో 'ఎవ్రీ చైల్డ్ రీడ్స్' కార్యక్రమంపై సమీక్షించిన ఆయన చింతకాని మండలంలో ఎంపిక చేసిన ఐదు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రత్యేకంగా తయారు చేసిన యాప్ ద్వారా కార్యక్రమం అమలుచేయాలని తెలిపారు. ఇవికాక జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3నుంచి 4గంటల వరకు ఒక పీరియడ్‌ను సోమవారం నుంచే కేటాయించాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యా శాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సీ.హెచ్.రామకృష్ణ, సీఎంఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మోడల్‌గా జిల్లా

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలో మోడల్‌గా నిలపాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. బోనకల్ మండలంలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల పనులపై సోమవారం ఆయన టీజీఈడబ్ల్యూఐడీసీ సీఈ షఫీమియాతో సమీక్షించారు. స్కూల్ భవనంతో పాటే రోడ్లు, తాగునీటి వసతి, పార్కింగ్, విద్యుద్దీకరణ పనులు పూర్తిచేయాలని తెలిపారు. పీఆర్ ఎస్ఈ జి.వెంకటరెడ్డి, సీపీఓ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు సమృద్ధిగా ఇసుక

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో ఇందిరమ్మ లబ్ధిదారులకు సరిపడా ఇసుక లభ్యమయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఇసుక లభ్యతపై కలెక్టర్ సోమవారం అధికారులతో సమీక్షించారు. స్థానిక వనరుల నుంచి ఇసుక సరఫరాకు చర్యలు తీసుకోవాలని, ఇళ్ల పేరిట ఇసుక పక్కదారి పట్టకుండా నిఘా వేయాలని సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగులకు భోజనం


కండక్టర్‌కు భోజనం అందిస్తున్న ఆర్‌ఎం సరిరామ్

ఖమ్మంమయూరిసెంటర్: విధినిర్వహణలోఉన్న ఆర్టీసీ ఉద్యోగులు సోమవారం ఖమ్మం రీజియన్ మేనేజర్ సరిరామ్ భోజనం ప్యాకెట్లు అందజేశారు. దసరా పండుగ రద్దీ నేపథ్యాన కండక్టర్, డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది నిరంతరాయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో వీరికి భోజనం సమకూర్చారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, డీఎం శివప్రసాద్, సెక్యూరిటీ ఎస్సై కోటాజీ పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జిగా శ్రీనివాస్


శ్రీనివాస్‌కు నియామకపత్రం ఇస్తున్న కృష్ణయ్య

ఖమ్మంమామిళ్లగూడెం/కల్లూరు రూరల్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, సత్తుపల్లికి చెందిన నారాయణవరపు శ్రీనివాస్‌కు సంఘం భద్రాద్రి జిల్లా బాధ్యతలు కూడా అప్పగించారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయనకు సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామక పత్రం అందజేశారు. కాగా, బీసీ రిజర్వేషన్ల కోసం శ్రీనివాస్ ఆమరణ దీక్ష చేయడంపై అభినందించారు. నాయకులు గద్దె వెంకటరామయ్య, మరీదు ప్రసాద్ గౌడ్, రాజేందర్, అనంతయ్య, రేగా రమేష్, రాజు కోటి, కర్రీ కమలాకర్, జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఐ టాపర్‌కు ఎస్‌బీఐ అధికారుల సన్మానం


పల్లవిని సన్మానిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

తిరుమలాయపాలెం/ఖమ్మం గాంధీచౌక్: ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ప్రోగ్రామింగ్‌లో జాతీయ స్థాయి టాపర్‌గా నిలిచిన ఖమ్మం రూరల్ మండలం ఆరెంపులకు చెందిన తాల్లూరి పల్లవి ఇటీవల ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా పల్లవితో పాటు ఆమె తల్లిదండ్రులను సోమవారం ఎస్‌బీఐ రీజియన్ అధికారులు సన్మానించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన పల్లవి జిల్లాకు కీర్తి తీసుకొచ్చిందని కొనియాడారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్లు వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి, బ్రాంచ్ మేనేజర్లు షేక్ ఇబ్రహీం, ఉదయ్, చేతన్ పాల్గొన్నారు. అలాగే, ఆరెంపుల హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పల్లవిని పర్యావరణ వేత్త డాక్టర్ కడవెండి వేణుగోపాల్ సత్కరించారు.

అండర్-19 టీ.టీ. జట్ల ఎంపిక


జిల్లా జట్లతో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-19 జూనియర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ జట్లను సోమవారం ఎంపిక చేశారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ చాటిన వారితో బాలబాలికల జట్లను ఎంపిక చేయగా, త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వీ.వీ.ఎస్. మూర్తి, క్రీడల సంఘం కార్యదర్శి ఎం.డీ.మూసీ కలీం తెలిపారు. కాగా, బాలుర జట్టుకు పి.మోహిత్‌కృష్ణ, ఈ.తరుణ్, జి. జెస్సీ, ఏ.వివేక్, కె.శశాంక్, టి.అఖిలేష్, బాలికల జట్టుకు జి.చంద్రికరాణి, కె.నవ్య, జి.షర్మిల, టి.శ్రీఅమృత, వి.సుప్రియ, శౌర్య ఎంపికయ్యారని వెల్లడించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	5,650	2,800
ఏసీ మిర్చి	15,300	8,000
మిర్చి	8,200	5,000
కొత్త పత్తి	7,101	4,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.19,400

ఎల్‌ఆర్‌ఎస్ చకచకా..

- ఫీజులు చెల్లించిన దరఖాస్తులకు ప్రొసీడింగ్స్
- కేఎంసీలో 51.7 శాతం దరఖాస్తుల పరిశీలన పూర్తి
- సాంకేతిక, ఇతర కారణాలతో మిగతావి జాప్యం


దరఖాస్తుల స్థితి తెలుసుకునేందుకు కేఎంసీకి వచ్చిన దరఖాస్తుదారులు (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్(లే ఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కింద రూ.వేయి చెల్లించి దరఖాస్తు చేసుకుని.. నిర్దేశిత ఫీజు కూడా చెల్లించిన వారికి అధికారులు ప్రొసీడింగ్స్ జారీ చేస్తున్నారు. గత ఐదేళ్లుగా స్థలంపై యాజమాన్య హక్కుల కోసం దరఖాస్తుదారులు పడరాని పాట్లు పడగా.. ప్రభుత్వం సమస్యకు పరిష్కారం చూపేలా గతేడాది ఫీజు కట్టించుకుంది. ఆతర్వాత ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఐదు మున్సిపాలిటీల పరిధిలో ప్రొసీడింగ్స్ జారీలో జాప్యం జరగడంతో దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఇంతలోనే కలెక్టర్, కేఎంసీ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు చెల్లించిన వారికి ప్రొసీడింగ్స్ జారీ చేయడాన్ని ప్రథమ ప్రాధాన్యత తీసుకోవాలని ఆదేశించారు. దీంతో కొద్దిరోజులుగా ప్రొసీడింగ్స్ జారీ ప్రక్రియ వేగవంతమైంది.

19,277 మంది ఫీజు చెల్లింపు

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు వైరా, మధిర, ఎదులాపురం, సత్తుపల్లి, కల్లూరు మున్సిపాలిటీల్లో లే ఔట్ రెగ్యులరైజేషన్ కోసం 19,277 మంది ఫీజు చెల్లించారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా రాయితీపై ఫీజు చెల్లించిన వారికి అధికారులు ప్రొసీడింగ్స్ ఇవ్వాల్సి ఉన్నా రకరకాల కారణాలతో జాప్యం జరిగింది. ఆపై దరఖాస్తులను మూడు దశల్లో పరిశీలించాలని అధికారులు నిర్ణయించారు. ఎల్-1లో అర్బన్ ఏరియాలోని టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పత్రాలను పరిశీలిస్తున్నారు. అంతా సక్రమంగా ఉంటే ఎల్-2కు పంపిస్తున్నారు. అక్కడ టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్‌కు పైస్థాయి అధికారి పత్రాలను పరిశీలించి ఎల్-3 కి పంపుతున్నారు. అనంతరం అర్బన్ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ దరఖాస్తులను పరిశీలించి అన్నీ సవ్యంగా ఉన్న దరఖాస్తులకు ప్రొసీడింగ్స్ జారీ చేస్తున్నారు.

సిబ్బంది కొరత.. సాంకేతిక సమస్య

జిల్లాలో కేఎంసీతో పాటు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 19,9277 మంది ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించగా..

అత్యధికంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నుంచే ఉన్నాయి. కేఎంసీ పరిధిలో 12,614 మంది ఫీజులు చెల్లించినా సిబ్బంది కొరతతో ఉన్న వారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీనికి తోడు ఎల్‌ఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపాలతో పరిశీలన మరింత జాప్యం జరుగుతోంది. ఇప్పటికీ దరఖాస్తుదారులు జత చేసిన పత్రాలు పూర్తిస్థాయిలో సైట్‌లో కనిపించక ఇక్కట్లు ఎదురవుతున్నాయి. అంతేకాక పరిశీలనలో మూడు శాఖల ఉద్యోగులు సమన్వయంతో పని చేయాల్సి ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. అయితే, కాస్త అటూఇటుగానైనా కలెక్టర్, కమిషనర్ చొరవతో ఫీజు చెల్లించిన వారికి ప్రొసీడింగ్స్ జారీ అవుతుండడంతో దరఖాస్తుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఫీజు చెల్లించిన దరఖాస్తులు సంఖ్య, ప్రొసీడింగ్స్ జారీ వివరాలు

సంస్థ	ఫీజు చెల్లించింది	ప్రొసీడింగ్స్ జారీ అయినవి
ఖమ్మం కార్పొరేషన్	12,614	6,523
సత్తుపల్లి మున్సిపాలిటీ	654	621
మధిర	1,101	979
ఏదులాపురం	3,3946	2,323
వైరా	725	535
కల్లూరు	237	110
మొత్తం	19,277	11,091

అసైన్డ్ భూమి.. అమ్మేసెయ్!


అయ్యగారిపేట రెవెన్యూ పరిధిలోని అసైన్డ్ భూమి

- దర్జాగా భూముల క్రయవిక్రయాలు
- సరిహద్దు పట్టానంబర్ ఆధారంగా బదలాయింపు
- అధికారుల అండతో అక్రమార్కుల లీలలు

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రం రోజురోజుకు విస్తరిస్తుండడంతో భూములరకు డిమాండ్ పెరుగుతోంది. దీనికి తగ్గట్టుగానే రియల్ ఎస్టేట్ మాఫియా భూములకు అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. సత్తుపల్లి రెవెన్యూ, అయ్యగారిపేట రెవెన్యూ పరిధిలో ఈ దందా విచ్చలవిడిగా సాగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. భూరికార్డుల ప్రక్షాళన సమయాన అసైన్డ్ భూములను పట్టా భూములుగా నమోదు చేసి అక్రమాలకు తెరలేపినట్లు సమాచారం. నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన వ్యవసాయ భూమి క్రయవిక్రయాలపై నిషేధం అమల్లో ఉంది. ఈమేరకు ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్ 1970 చట్టం ప్రకారం అసైన్డ్ భూముల అమ్మితే విచారణ జరిపి ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది.

సరిహద్దు పట్టా నంబర్లు వేసి...

అయ్యగారిపేట రెవెన్యూ పరిధిలో అసైన్డ్ భూమికి సరిహద్దు పట్టా భూముల సర్వే నంబర్లు వేసి దర్జాగా రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాకర్లపల్లి రోడ్డు, కల్పతరురోడ్డు వైపుకు వెళ్లే రహదారిలోని దళితుల కు అసైన్డ్ భూమిని జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ పేరిట రాయించుకొని.. ఆపై ఖాళీ నివేశస్థలంగా మార్చి క్రయవిక్రయాలు జరిపినట్లు సమాచారం. సరిహద్దు వెంట గాడిదల వాగులో ముంపునకు గురైన పట్టా భూమి సర్వే నంబర్ల ఆధారంగా ఈ భూమి రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిసింది. ఇప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో అసైన్డ్ భూమిగా నమోదై ఉన్నా కుంటలుగా విభజించి రోడ్లు వేసి మరీ క్రయవిక్రయాలు జరుపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సాధారణంగా వ్యవసాయ భూమిని ఇళ్ల స్థలాలుగా మార్చాలంటే నాలా కన్వర్షన్ చేయాల్సి ఉంటుంది. ఇవేవీ లేకుండానే అసైన్డ్ భూమిని ఇళ్ల స్థలాలుగా విక్రయించి పట్టా భూమి సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. అలాగే, సత్తుపల్లిలోని కల్పతరు రోడు, మరో అసైన్డ్ భూమి విషయంలో ఇలా జరగగా.. భూమిని అధికార పార్టీ ప్రముఖుడికి విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

అధికారుల సహకారంతో..

అక్రమాల్లో అందరికీ వాటా ఉండడంతో రెవెన్యూ సబ్ రిజిస్ట్రార్ల అండతో భూమి రికార్డులు మార్పులు చేసుకుంటున్నట్లు తెలిసింది. అధికారుల సహకారంతో భూముల సర్వే నంబర్లు ఏమార్చి.. వీటిని నాలా కన్వర్షన్ చేసి ప్లాట్లుగా విభజించి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు సమాచారం. అసైన్డ్, ప్రభుత్వ భూములపై విచారణ జరిపిస్తే ఇలాంటి అక్రమాలు మరిన్ని వెలుగులోకి వస్తాయని చెబుతున్నారు. ఇక అవగాహన లేకుండా అసైన్డ్ భూములను కొన్న పలువురు ఇంటి అనుమతి, బ్యాంకు రుణాల సమయాన ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. నిషేధిత, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై నిబంధనల మేరకు నడుచుకుంటున్నామని తెలిపారు. తాను విధుల్లో చేరాక అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు చేపట్టలేదని స్పష్టం చేశారు.

'ఆహార ఉత్పత్తులపై బహుళ జాతి కంపెనీల కన్ను'


మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

కూసుమంచి: దేశ వ్యవసాయ రంగంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెత్తనం చెలాయిస్తుండగా, ఆ దేశానికి ప్రధాని మోదీ మోకరిల్లుతున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ విమర్శించారు. కూసుమంచిలో సోమవారం నిర్వహించిన సంఘం పాలేరు డివిజన్ మహాసభలో ఆయన మాట్లాడారు. దేశంలో పండించే ఆహార ఉత్పత్తులపై బహుళజాతి కంపెనీల కన్ను పడిందని పేర్కొన్నారు. దీంతో కార్పొరేట్ శక్తులను అడ్డుపెట్టుకుని వ్యవసాయ రంగాన్ని నాశనం చేసేలా ప్రధాని వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈక్రమాన రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుండగా వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు ఉద్యమాలు, పోరాటాల ద్వారా వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలని సుదర్శన్ పిలుపునిచ్చారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం పాలేరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా బిక్కసాని గంగాధర్, గుడవర్తి నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, నాయకులు రమణారెడ్డి, నర్సింహారావు, వెంకటరెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సన్మంతరావు, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, అశోక్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తప్పిన పెనుప్రమాదం

పిడుగుపాటుతో చీలిపోయిన చెట్టు


పిడుగుపాటుకు ధ్వంసమైన చెట్టు

ముదిగొండ: ప్రభుత్వపాఠశాల ఆవరణలో పిడుగు పడగా.. ఆ సమ యాన విద్యార్థులెవరూ సమీపాన లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ముదిగొండ మండలం వనంవారి కిష్టాపురంలో ఉన్న ముత్తారం హైస్కూల్ ఆవరణలోని గిన్నెచెట్టు పై సోమవారం సాయంత్రం వర్షం కురుస్తుండగా పిడుగు పడింది. భారీగా శబ్దం రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉలిక్కిపడగా ఆ సమయాన ఎవరూ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే, పిడుగుపాటుతో చెట్టు నిట్టనిలువునా చీలిపోయింది.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

చింతకాని: ఏపీఎస్‌పీ మూడో బెటాలియన్ కానిస్టేబుల్ కుటుంబసభ్యులపై దాడి చేసిన ఘటనలో చింతకాని మండలం పాతర్లపాడు ఎస్సీ కాలనీకి చెందిన దిలీప్‌తో పాటు మరో ఇద్దరిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశా రు. నేలకొండపల్లి మండలం బోదులబండకు చెందిన కానిస్టేబుల్ కట్టికోల శ్రీనివాస్ కుటుంబసభ్యులతో కలిసి కారులో పెనుగంచిప్రోలులోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ తల్లి దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ఆదివారం రాత్రి నాగులవంచలో దిలీప్ సహా ముగ్గురు ద్విచక్ర వాహనాన్ని అడ్డుగా పెట్టి కారు నిలిపివేశారు. ఆపై కారులో ఉన్న కవిత, సంగీత, సందీప్, సునీతపై దాడి చేశారు. ఈ ఘటనను వీడియో తీస్తుండగా వారి సెల్‌ఫోన్లను పగులగొట్టి చంపుతామని బెదిరించారు. దీంతో కవిత ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరేందర్ తెలిపారు.

అభివృద్ధి సరే... ఆగే రైళ్లు ఏవీ?

- మధిర రైల్వేస్టేషన్ ద్వారా ఏటా రూ.5కోట్ల ఆదాయం
- అయినా పలు రైళ్లకు హాల్టింగ్ కరువు
- ఇబ్బందుల్లో ఏపీ – తెలంగాణ ప్రయాణికులు


మధిర రైల్వే స్టేషన్

మధిర: అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందంగా మారింది మధిర రైల్వేస్టేషన్ పరిస్థితి. ఈ రైల్వేస్టేషన్‌లో అవసరమైన రైళ్లను ఆపకుండా అభివృద్ధి చేస్తుండడంపై విమర్శలు వస్తున్నాయి. అమృత్ భారత్ పథకంలో భాగంగా మధిర రైల్వేస్టేషన్‌ను రూ.25 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్న ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేయడంపై హర్షం వ్యక్తమవుతున్నా.. అవసరమైన రైళ్లకు హాల్టింగ్ లేకపోవడంపై పలువురు పెదవి విరుస్తున్నారు.

రోజూ 2వేల మంది రాకపోకలు

మధిర రైల్వేస్టేషన్ ద్వారా ప్రతిరోజు సుమారు 2,200 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే, ఈ ప్రాంత ప్రజలకు అవసరమైన రైళ్లకు హాల్టింగ్ ఇవ్వకపోగా, గతంలో ఆగిన పలు రైళ్ల హాల్టింగ్ కూడా ఎత్తివేశారు. మధిర నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులకు పద్మావతి ఎక్స్‌ప్రెస్ సౌకర్యంగా ఉంటుంది. కానీ తిరుపతికి వెళ్లే మార్గంలో ఉన్నప్పటికీ తిరుగు ప్రయాణంలో హాల్టింగ్ లేదు. దీంతో తిరుపతి వెళ్లిన భక్తులు విజయవాడకు వచ్చి అక్కడి నుంచి కోణార్క్ లేదా శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా మధిర చేరాల్సి వస్తోంది. ఈ క్రమాన గంటల తరబడి సమయం వృథా అవుతోందని వాపోతున్నారు. అంతేకాక ఈ ప్రాంత ప్రజలు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్(12655, 12656) రైలుకు హాల్టింగ్ ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రెండు రాష్ట్రాల సరిహద్దు

నియోజకవర్గ కేంద్రమైన మధిర తెలంగాణ – ఏపీ రాష్ట్రాలకు సరిహద్దులో ఉంది. దీంతో ఏపీ రాష్ట్రంలోని తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల ప్రజలతోపాటు మధిర పరిసర ప్రాంత ప్రజలు ఈ రైల్వేస్టేషన్ నుంచే ప్రయాణిస్తుంటారు. వీరికి అవసరమైన రైళ్లకు హాల్టింగ్ లేకపోవడంతో అటు విజయవాడ లేదా ఖమ్మం వెళ్లాల్సి వస్తోంది. స్టేషన్ ద్వారా ఏటా సుమారు రూ.5కోట్ల ఆదాయం వస్తున్నా, ఏటా ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా పదేళ్ల క్రితం నాటి రైళ్లు తప్ప కొత్తవి ఆగడం లేదు. ఈవిషయమై ప్రజాప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం కానరావడం లేదు. ఇకనైనా గతంలో హాల్టింగ్ ఉన్న రైళ్లను పునరుద్ధరించడంతో పాటు ఇంకొన్ని ఎక్స్‌ప్రెస్‌లను ఆపాలని.. తద్వారా ఆదాయం పెరిగి ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడుతుందని చెబుతున్నారు.

హాల్టింగ్ తొలగించిన రైళ్లు

కరోనా కంటే ముందు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మధిర హాల్టింగ్ ఉండేది. ఇందులో గౌతమి ఎక్స్‌ప్రెస్(12737, 12738), సింహపురి ఎక్స్‌ప్రెస్ (12710, 12709), పద్మావతి ఎక్స్‌ప్రెస్ (12763), విశాఖపట్నం – మహబూబ్ నగర్ ఎక్స్‌ప్రెస్ (12861), లక్నో ఎక్స్‌ప్రెస్ (16093, 16094)కు హాల్టింగ్ ఎత్తివేయడం గమనార్హం.

ఇకనైనా పునరుద్ధరించాలి



గతంలో మధిర స్టేషన్‌లో ఆగిన అన్ని రైళ్ల హాల్టింగ్ పునరుద్ధరించాలి. తిరుపతికి వెళ్లే భక్తులు మధిర స్టేషన్‌కే వస్తుంటారు. వెళ్లడానికి పద్మావతి రైలు అందుబాటులో ఉన్నా తిరుగు ప్రయాణంలో హాల్టింగ్ లేదు. దీంతో విజయవాడలో దిగి ఇబ్బంది పడాల్సి వస్తోంది. – పాలడుగు మురళి, మధిర

ఆంధ్రా నుంచి వస్తుంటాం..



ఏపీలోని పలు ప్రాంతాల నుంచి మధిర చేరుకుని విజయవాడ, హైదరాబాద్, ఢిల్లీ, కలకత్తా ప్రాంతాలకు వెళ్తుంటాం. రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న ఈ స్టేషన్ ఎంతో సౌకర్యంగా ఉంటుంది. మరికొన్ని రైళ్లకు హాల్టింగ్ ఇస్తే ప్రయాణికుల సంఖ్య ఇంకా పెరుగుతుంది. – పద్మనాభుని నవీన్, పెనుగొలను

ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్


పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

ముదిగొండ: ముదిగొండ మండలంలోని గంధసిరి, పెద్దమండవ పరిధి మున్నేటి నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను సోమవారం పోలీసులు సీజ్ చేశారు. సువర్ణాపురం క్రాస్ వద్ద చేపట్టిన తనిఖీల్లో ఇసుక తరలింపునకు అనుమతి లేదని గుర్తించి సీజ్ చేశామని సీఐ మురళి తెలిపారు. ఈమేరకు డ్రైవర్లు, యాజమానులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

క్షతగాత్రురాలికి డీసీహెచ్‌ఎస్ చేయూత


మాధవికి చికిత్స చేస్తున్న డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్

రఘునాథపాలెం: ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయురాలికి ఆ మార్గంలో వెళ్తున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ తక్షణ చికిత్స అందించి ఆస్పత్రికి తరలించారు. కొణిజర్ల మండలం పెద్దగోపతి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలైన మాధవి సోమవారం సాయంత్రం విధులు ముగించుకొని ఖమ్మం వెళ్తుండగా వీవీపాలెం స్టేజీ వద్ద కుక్క అడ్డు రావడంతో స్కూటీ అదుపు తప్పగా కిందపడింది. దీంతో ఆమె తలకు బలమైన గాయం కావడంతో పక్కనే షాప్‌లో ఉన్న నాగవాణి సీపీఆర్ చేసింది. అంతలోనే అదే మార్గంలో వెళ్తున్న డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ తన కారులో ఆమెకు చికిత్స చేస్తూ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఫలితంగా మాధవికి ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు


గాయపడిన చిన్నారులు

సత్తుపల్లిటౌన్: పాఠశాలకు వెళ్తున్న చిన్నారులపై వీధికుక్కలు దాడిచేయగా గాయాలయ్యాయి. సత్తుపల్లి జేవీఆర్ పార్క్ ఎదురుగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ గృహ సముదాయం నుంచి పాత సెంటర్ ప్రభు త్వ పాఠశాలకు సోమవారం విద్యార్థులు వెళ్తుండగా వీధికుక్కలు వెంబడించాయి. దీంతో ఆందోళనకు గురైన వారు కేకలు వేస్తూ పరుగు పెట్టారు. రెండో తరగతి విద్యార్థులు అబ్దుల్‌రషీద్, జి.శ్రావణ్‌కుమార్‌ను కుక్కలు వెంబడించి కరవడంతో గాయాలు కాగా తల్లిదండ్రులు చికిత్స చేయించారు.

రైలుకింద పడి ఆత్మహత్య

బోనకల్: బోనకల్ రైల్వేస్టేషన్ సమీపాన ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని తూటికుంట్లకు చెందిన గందమాల సారధి(34) కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఐదు నెలల క్రితం భార్య విడిచిపెట్టి వెళ్లడంతో తరచూ మద్యం సేవించేవాడు. ఈక్రమాన ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వెతుకున్నారు. ఇంతలోనే బోనకల్ స్టేషన్ సమీ పాన మృతదేహం ఉండడంతో పరిశీలించగా సారధిగా గుర్తించారు. ఈమేరకు ఆయన కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు.